క్లుప్తంగా

నేడు మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

మల్దకల్: మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న మైనార్టీ నిరుద్యోగులకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న 46 మంది అభ్యర్థులు స్టడీ సర్టిఫికెట్స్‌తో పాటు ఆధార్, ఆదాయం, కులం ధ్రువపత్రాలు తీసుకురావాలని కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



అయిజ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో 45 రోజుల పాటు నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ఎస్ఐ నరేష్ కుమార్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తైక్వాండో శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణను పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్ అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్‌లు మధు కుమార్, రమేష్, శేక్షావలి ఆచారి, సుధీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పాటల పండరీనాథ్ జయంతి

గద్వాల న్యూటౌన్: జిల్లా కేంద్రంలోని మార్కెండేయ ఆలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, పాటల పండరీనాథ్ జయంతిని సోమవారం మంజులానంద మంజునాథ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కవిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా ఆయన చేసిన సేవలు కొనియాడారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రసాదనంద గుండేటి ప్రసాద్ స్వామి, గురు భక్తులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు నివాళి

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడ సర్పంచ్ మార్తమ్మ(75) ఆదివారం మృతి చెందిన విషయం విదితమే. సోమవారం జెడ్పీ చైర్ పర్సన్ సరిత, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, జెడ్పీటీసీ సుగుణమ్మ, బీఆర్ఎస్ నాయకులు ఆర్.కిషోర్, ఆయా పార్టీల నాయకులు సర్పంచ్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మరణం పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు.

జెడ్పీ చైర్ పర్సన్ పరామర్శ

మల్దకల్: రైతుబంధు మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఇటీవల కర్నూలు ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలో ఆయన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. సోమవారం విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత మధుసూదన్‌రెడ్డిని పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుపతయ్య, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, మల్దకల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్రీడా శిక్షణ

ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 3వ తేదీ నుంచి 31వ తేదీ వరకు డీఎస్ఏ ఆధ్వర్యంలో క్రీడా శిక్షణ ఉచితంగా ఇస్తున్నట్లు నిర్వాహకులు రషీద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్, క్రికెట్, తైక్వాండో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం, సాయంత్రం వేళలో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మల్దకల్: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేస్తునట్లు తహసీల్దార్ హరికృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

పిడుగు పాటుకు ఎద్దు మృతి



కేటీదొడ్డి: మండల పరిధిలోని పాతపాలెం గ్రామానికి చెందిన కుమ్మరి పల్లెన్న వ్యవసాయ పొలంలో ఎద్దును కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం రాత్రి మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఎద్దుపై పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఉదయం రైతు వ్యవసాయ పొలానికి వెళ్లగా అప్పటికే ఎద్దు మృతిచెందడంతో కన్నీటిపర్యంతం అయ్యాడు. సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు.



నందిన్నెలో జెండా ఎగురవేసిన కార్మికులు



ధరూరులో హమాలీ సంఘం ఆధ్వర్యంలో..



ఉండవెల్లిలో ..



మానవపాడులో..

ఘనంగా కార్మిక దినోత్సవం

అలంపూర్: పట్టణంలోని సీఐటీయూ, సీపీఐ ఆధ్వర్యంలో మేడేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ సీఐటీయూ జెండాను, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పెద్ద బాబు ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 190 మంది హమాలీ కార్మికులకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సువర్ణమ్మ కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఇన్‌చార్జ్ కార్యదర్శి అనిల్ కుమార్, కార్మికులు తదితరులు ఉన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్మికులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. బల్గెరలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతునాయుడు జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు నర్మద, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మారెన్న, పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రూపవతి, మాజీ సర్పంచ్ సామేలు, తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో సీఐటీయూ నాయకులు, హమాలీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజి కార్మిక జెండాను ఎగురవేశారు. జూరాల మిషన్ భగీరథ ప్లాంటు వద్ద మేడే కార్యక్రమంలో భాగంగా చింతరేవుల ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కృష్ణ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు డీఆ విజయ్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రంగన్న, సీపీఎం, హమాలీ, భవన నిర్మాణ సంఘం నాయకులు నర్సింహులు, ప్రవీణ్, గోవిందు, పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో మే డే నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ఎర్రజెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వెంకట్రాముడు, సుంకన్న, మద్దిలేటి, హుస్సేన్, రామకృష్ణ, అంజి, శివ, మద్దిలేటి, పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి పురపరిధిలోని శాంతినగర్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. లైట్ మోటార్ వెహికల్స్, జీప్ డ్రైవర్స్ ఓనర్స్, ఆటో యూనియన్, హమాలీ యూనియన్‌ల ఆధ్వర్యంలో ఎర్రజెండాలు ఎగురవేశారు. మున్సిపల్ చైర్మన్ కరుణ, మద్దిలేటిగౌడ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, వెంకట్రాముడు మద్దిలేటి, రఫీ, రవి, రజాక్, మాలిక్, బాషా, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రంలో మేడే ఉత్సవాలలో సీపీఎం, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్, రిక్షా యూనియన్, హమాలీ వర్కర్స్, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, ఉప సర్పంచ్ గోపాల్, మాజీ సర్పంచ్ శ్రీరామ్ రెడ్డి పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సీఐటీయూ అనుబంధ సంఘాల కార్మిక నాయకులు సంజీవులు, అంజి, కర్రెప్ప, గంగన్న , తిమ్మప్ప, బద్రి, సవారన్నలు కార్మిక జెండాను ఆవిష్కరించారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంతో పాటు నందిన్నె, వివిధ గ్రామాల్లో సోమవారం కార్మిక జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో భీమరాయుడు, రంగారెడ్డి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కార్మికులు ఎర్రజెండాను ఎగురవేశారు.



అలంపూర్ నినదిస్తున్న సీపీఎం నాయకులు, కార్మికులు



అయిజలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



శాంతినగర్‌లో ..



రాజోళిలో..



అలంపూర్ చౌరస్తాలో దుస్తులు అందజేస్తున్న మార్కెట్ యార్డు చైర్ పర్సన్



మల్దకల్‌లో జెండావిష్కరణ చేస్తున్న సీఐటీయూ నాయకులు



గట్టులో కార్మిక దినోత్సవంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె



గట్టులో కళ్లకు గంతలను కట్టుకుని నిరసన తెలుపుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆవరణలో మండలంలోని జూనియర్ కార్యదర్శులు చేపట్టిన సమ్మె సోమవారంతో 4వ రోజుకు చేరింది. ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు టీఎన్జీఓ రాష్ట్ర సెక్రెటరీ భీమన్న, జిల్లా అధ్యక్షుడు నాగర్జున్ గౌడ్, జనరల్ సెక్రెటరీ ఆనంద్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటరాయ రెడ్డి, సీపీఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణు, పట్టణ కార్యదర్శి అప్రిత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ్మ, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు అంజిలు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు పాండు, ప్రవీణ్, శశికళ తదితరులు ఉన్నారు.

వంటావార్పుతో నిరసన

మల్దకల్: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల వంటావార్పు చేసి నిరసన తెలిపారు. సమ్మెకు ఎంపీడీఓ కృష్ణయ్య, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, సత్యానారాయణ, అంజనేయులు, పరుషరాముడు, అయ్యపురెడ్డి, హరిక, మారెప్ప, లావణ్య సరిత, కృష్ణవేణి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని..

గట్టు: జూనియర్ కార్యదర్శులు కళ్లకు నల్లగుడ్డను కట్టుకుని నిరసన తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 4వ రోజు ఆందోళనను కొనసాగించారు.

మానవపాడు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు సోమవారం రెవెన్యూ అధికారులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరేంధర్‌రెడ్డి, జయమ్మ, హరిత, నాగరాజు, సురేష్, అశోక్ పాల్గొన్నారు.



మల్దకల్‌లో వంటావార్పుతో నిరసన



గద్వాలలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

నూతన కమిటీ ఎన్నిక

అలంపూర్: మున్సిపాలిటీలో జోగుళాంబ ఎత్తిపోతల పథకం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ నూతన అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షుడిగా బ్రహ్మేశ్వర రెడ్డి, కోశాధికారిగా విశ్వనాథం, కార్యదర్శిగా రజినిబాబు, సహాయ కార్యదర్శిగా పెద్దబాబు, న్యాయ సలహాదారుగా నాగరాజు యాదవ్, సభ్యులుగా చిన్న సోమన్న, జయన్న, శ్రీనివాసులు, కృష్ణ నాయుడు, చెంచన్నలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం



మల్దకల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల సంఘం గద్వాల జిల్లా కార్యదర్శి లావణ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించడంతో పాటు మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కరపత్రికలను విడుదల చేశారు. అలాగే వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ కృష్ణయ్యకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ వృత్తిదారుల సంఘం నాయకులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల నిరసన

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని వీఓఏలు చేస్తున్న సమ్మె సోమవారం నాటికి 15 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు తిమ్మప్ప మాట్లాడుతూ వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు కిరణ్, శ్రీనివాసులు, పావని, రవి, మహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: వీఓఏల సమస్యలను పరిష్కరించాలని వీఓఏల సంఘం మండల నాయకులు బాషా, చంద్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల మహిళా సమాఖ్య భవనం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగింది. కార్యక్రమంలో వీఓఏల సంఘం శంకర్‌గౌడ్, తిమ్మప్ప, గోవిందు, లోకనాథ్, మునిస్వామి, హనుమంతు, వెంకట్రాములు, అపర్ణ, నవీన, ఏస్తేర్, తిరుమలేష్, మహేందర్, రమేష్ పాల్గొన్నారు.



కేటీదొడ్డిలో నిరసన తెలుపుతున్న వీఓఏలు



మల్దకల్ మహిళా సమాఖ్య భవనం ఎదుట నిరసన తెలుపుతున్న వీఓఏలు

అకాల వర్షంతో అన్నదాత ఆందోళన



గంగన్‌పల్లిలో నేలకొరిగిన వరిపైరు వద్ద రైతు

కేటీదొడ్డి: ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతులు అతలాకుతలం అవుతున్నారు. చేతికొచ్చిన పంటలు నేలకొరగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నందిన్నె, కుచినెర్ల, పాతపాలెం, ఈర్లబండ, వెంకటాపురం, కొండాపురం, గువ్వలదిన్నె, వెంకటాపురం, పాతపాలెం, కుచినెర్ల, తదితర గ్రామాలలో సోమవారం తెల్లవారుజామున భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మామిడి కాయలు రాలిపోయాయి. వరిధాన్యం తడిసిపోయింది. పాతపాలెం గ్రామంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇండ్లలోకి వర్షం నీరు చేరింది. పాతపాలెం, గంగన్‌పల్లి, గ్రామాల్లో వరిపైరు నేలకొరిగింది. వెంకటాపురం చెరువు పూర్తిస్థాయిలో నిండింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరాఫరా నిలిచింది.

అధికార పార్టీ నాయకుల ఆగడాలను అడ్డుకోవాలి

అయిజ: అధికార పార్టీ నాయకుల ఆగడాలను అడ్డుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి శేక్షావలి ఆచారి అన్నారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన రోడ్ల వెంట డ్రైయినేజీ నిర్మాణం కోసం తీసిన మట్టిని కొందరు వ్యక్తులు కాంట్రాక్టర్లకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. తిక్క వీరేశ్వర స్వామి జాతర సందర్భంగా గుంతలు పూడ్చడానికి ప్రైవేట్ కాంట్రాక్టర్లకు రూ.3 లక్షలు బిల్లు కేటాయిస్తే మున్సిపాలిటీ ట్రాక్టర్లు, జేసీబీలను ఉపయోగించి ప్రభుత్వ డంపింగ్ యార్డ్ నుంచి మట్టిని తరలించి ఆ డబ్బును స్వాహా చేశారని ఆరోపించారు. జములమ్మ గుడి దగ్గర రూ. లక్షకు బిల్లు పెడితే మున్సిపాలిటీ ట్రాక్టర్లు, జేసీబీలతో మట్టి కొట్టి ఆ డబ్బును కూడా మింగేశారని పేర్కొన్నారు. అదేవిధంగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన కౌన్సిల్ మీటింగ్‌లకు చేసే ఖర్చు ప్రతి నెలా రూ. 2,500కు మించడంలేదని అన్నారు. అయితే సంవత్సర కాలంలో రూ. 4 లక్షల 10 వేలు ఖర్చు చేసినట్లు చెప్పి మిగిలిన డబ్బును స్వాహా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దేశ నాయకుల వర్ధంతి, జయంతులకు పూలదండలకు అయ్యే ఖర్చును కూడా రూ. లక్షల్లో చూపిస్తున్నారని అన్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు మున్సిపాలిటీని అవినీతిమయంగా మార్చారని వివరించారు. ప్రజాధనం కొల్లగొడుతున్న నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గిత్తల దేవరాజు, కాంగ్రెస్ నాయకులు హనుమన్న, మద్దిలేటి, మైనర్‌బాబు, సులోచనమ్మ, రవీందర్, మధు, బసవరాజు, లక్ష్మన్న, అంజి, షాలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి శేక్షావలి ఆచారి

భగవద్గీతపై అవగాహన

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని మునుగాలలో త్రైతసిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి ఎర్రవల్లి కమిటీ సభ్యులు గ్రామంలోని ఇటింటికి తిరిగి భగవద్గీత సారాంశాన్ని వివరించి గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు బీచుపల్లి, వెంకటేష్, పరుశరాముడు, వంశీ, తదితరులు ఉన్నారు.

అయిజ: మండలంలోని కుర్వపల్లిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి–ఇందూ జ్ఞానవేదిక బింగుదొడ్డి కమిటీ సభ్యులు లక్ష్మణ్, ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, జయమ్మ, సర్సమ్మ, సద్మమ్మ, జములమ్మ తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

అవినీతి ఎమ్మెల్యేల పేర్లు బయట పెట్టాలి

గద్వాల అర్బన్: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల పేర్లను సీఎం కేసీఆర్ వెంటనే బయటపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో లబ్ధిదారుల నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసిన ప్రజాప్రతినిధులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలను చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కన్నా, మన్యం, ఏసన్న, రంజిత్, రాజవర్ధన్, శ్రీను తదితరులు ఉన్నారు.